## క్లుప్తంగా

### ప్రైవేటు లైన్‌మన్‌కు ఆర్థిక సాయం



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రదీప్

**అల్లవరం:** ఇటీవల కరెంట్ స్తంభం పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయి వెన్నుముక విరిగి చికిత్స పొందుతున్న ఓడలరేవుకు చెందిన ప్రైవేటు లైన్‌మన్ నాగాబత్తుల శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన మధుర ప్రదీప్ తన స్నేహితుల ద్వారా సమకూర్చిన రూ.34,478 సొమ్మును మంగళవారం అందజేశారు. తన వాట్సాప్ స్టేటస్ ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చానని తెలిపారు. శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం చేసినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### తపాలా వారోత్సవాలను విజయవంతం చేయాలి

**అమలాపురం టౌన్:** ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ జరిగే తపాలా వారోత్సవాలను విజయవంతం చేయాలని అమలాపురం డివిజన్ ప్రధాన తపాలా కార్యాలయం సూపరింటెండెంట్ సలాది శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టుగెదర్ ఫర్ ట్రస్ట్ అనే అంశంపై ఈసారి వారోత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు లెటర్ రైటింగ్‌పై అవగాహన పెంచేందుకు డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి

**అమలాపురం రూరల్:** విద్యార్థులు చదువుతో పాటే క్రీడల్లోనూ రాణించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి అన్నారు. మంగవారం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత సెల్ కార్యదర్శి జాన గణేష్, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల జానకి లక్ష్మి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పట్టపగలే చోరీ

**అమలాపురం రూరల్:** మండలంలోని భట్నవిల్లి హైటెక్ కాలనీకి చెందిన రాయి వాసు ఇంటిలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామంలో సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వాసు కుటుంబ సభ్యులు వెళ్లారు. అదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు స్క్రూడ్రైవర్ సాయంతో తలుపులు పెకిలించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉంచిన మూడు కాసుల బంగారం, వెండి వస్తువులు, రూ.40 వేల నగదు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్‌ఐ అందే పరదేశి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరదేశి తెలిపారు.

# కొబ్బరి రైతుకు దన్ను

- అండగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకం
- కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుకునేందుకు అవకాశం



కొబ్బరి చెట్టు చుట్టూ తవ్విన పళ్లెం



కొబ్బరి చెట్టు చుట్టూ పళ్లాలను తవ్వుతున్న ఉపాధి కూలీలు

**అల్లవరం:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 100 రోజుల పాటు ఉపాధిని కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకూ ప్రయోజనం చేకూర్చుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులకు మేలు చేశాయి. ఫారమ్ పాండ్ల తవ్వకాలు, తోటల్లో కొబ్బరి చెట్లకు చుట్టూ నీరు, ఎరువు అందించేందుకు పళ్లాలు తవ్వుకునేందుకు అవకాశం కల్పించడంతో కొబ్బరి రైతులకు దన్నుగా నిలుస్తుంది.

**వెయ్యి మందికి ఉపాధి**

ఉపాధి జాబ్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటుచేసుకోవచ్చు. ఎకరానికి 80 నుంచి 100 కొబ్బరి చెట్లకు తవ్వకాలు జరిపేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది అంచనాలు రూపొందిస్తారు. పంచాయతీలోని గ్రామసభలో పంచాయతీ తీర్మానం అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు కొబ్బరి చెట్లకు పళ్లాల తవ్వకాలు చేస్తారు. రెండేళ్లకోసారి కొబ్బరి రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పళ్లాలు తవ్వుకునేందుకు అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మండలంలోని కొబ్బరి తోటలు ఎక్కువగా ఉండే గ్రామాలు అల్లవరం, దేవగుప్తం, బోడసుకుర్రు, ఎంట్రుకోన, గోడిలంక, గోడి, కోడూరుపాడు, గోడితిప్ప, ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాల్లో కొబ్బరి చెట్ల చూట్టురా పళ్లాల తవ్వకాలు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనుల ద్వారా ఏటా సుమారు 800 నుంచి 1000 మందికి ఉపాధి లభించడంతో పాటుగా 200 మంది రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు.

**ఎకరానికి రూ.5 వేలు ఆదా**



కొబ్బరి చెట్లకు ఎరువు పెట్టేందుకు చెట్టు చుట్టూ పళ్లాలు ఏర్పాటుచేసుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు నిర్వహించడం కొబ్బరి రైతుకు కాస్త ఆర్థిక దన్నుగా ఉంటుంది. ప్రస్తుతం కొబ్బరి రేటు బాగా పడిపోవడంతో ఉపాధి కూలీల ద్వారా పనులు నిర్వహించడం చెట్టుకి రూ.50 చొప్పున, ఎకరానికి రూ. 5 వేలు వరకూ ఆదా అవుతుంది.

– బొక్కా నాగ శివప్రసాద్, కొబ్బరి రైతు, అల్లవరం

**కొబ్బరి రైతులకు మేలు**



ఉపాధిహామీ పథకంలో ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు కొబ్బరి చెట్టులకు పళ్లాలు ఏర్పాటుచేస్తున్నాం. దీనివల్ల కొబ్బరి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. హెక్టారుకు రూ.10 వేల వరకూ రైతులకు ఆదా అవుతుంది. ఆసక్తి ఉన్న రైతులు మమ్మల్ని సంప్రదిస్తే వారి తోటల్లోనూ పనులు జరిపిస్తాం.

– వి.శ్రీనుబాబు, ఏపీఎం, అల్లవరం

### రెండు వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణ

**అమలాపురం టౌన్:** అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న కొందరు విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి మంగళవారం ఘర్షణకు దిగారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో రెండు వర్గాల విద్యార్థులు ఒకరినొకరు తోసుకుంటూ గలాటా సృష్టించారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ సిబ్బందితో తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల విద్యార్థులను చెదరగొట్టారు. ఇటీవల కళాశాలలో జరిగిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు సంబంధించి జరిగిన వివాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఘర్షణకు కారణమైన విద్యార్థులను గుర్తించి కేసులు నమోదు చేసేందుకు కూడా వెనకాడమని సీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. పది రోజుల క్రితం ఇదే కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సెంటరులో ఘర్షణకు దిగారన్న చర్చ సాగుతుంది.

### నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

**అల్లవరం:** అల్లవరం మండల కేంద్రంలో రూ.3.90 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకల ఆస్పత్రిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతరం గోడిలంకలో గ్రామ సచివాలయ ప్రారంభం, ఎస్సీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన, బెండమూర్లంకలో ఆర్‌బీకే ప్రారంభోత్సం చేస్తారన్నారు.

## దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

**అమలాపురం రూరల్:** పట్టణంలో జరిగే దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ 44వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను మంత్రి విశ్వరూప్‌కు మంగళవారం భట్నవెల్లిలోని ఆయన నివాసంలో కమిటీ ప్రతినిధులు కలిసి అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మంత్రిని కలిసివారిలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల బుజ్జి, మామిడిపల్లి రాంబాబు, వెలిగట్ల జగదీష్ బాబు, గంగాబత్తుల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## స్వాతంత్య్ర సమరయోధుల్ని స్మరించుకోవాలి



సేకరించిన మట్టిని కుండలో వేస్తున్న విద్యార్థులు

**యానాం:** దేశానికి స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సమరయోధుల్ని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రీజెన్సీ హైస్కూల్‌లో నా మట్టి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గ్రామాల్లో సేకరించిన మట్టిని ఓ కుండలో వేసి యానాం మున్సిపాలిటీకి అందజేశామని ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఇన్‌చార్జి చెక్కల వీరభద్రరావు, పీఈటీ నంద్యాల వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యుత్ దీపాల కోసం వినతి



అగ్రహారంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

**యానాం:** పట్టణ పరిధిలోని కొత్తపేట అగ్రహారంలో విద్యుత్ దీపాలతో పాటు డ్రైనేజీపై సిమెంట్ పలకలను వేయించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు గ్రామస్తులు విన్నవించారు. మంగళవారం అగ్రహారంలో పర్యటించిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చారు. స్థానిక డ్రైనేజీ వ్యవస్థను ఆయన పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ముస్లిం సంఘ సీనియర్ నాయకుడు ఎంఏ ఖాన్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ పరామర్శించారు. ఇటీవలే వివాహం చేసుకున్న బిస్మిల్లా యువజన సంఘ అధ్యక్షుడు కరీంఖాన్ దంపతులను ఆయన ఆశీర్వదించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఉప్పలగుప్తం:** ఇద్దరు వ్యక్తుల మధ్య చెలరేగిన వివాదం కారణంగా అవమానంతో దాకారపు అర్జునరావు(57) అనే వ్యక్తి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గోపవరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మీ పెదనాన్నకు ఓ మహిళతో అక్రమ సంబంధం ఉందంటూ సరిపల్లికి చెందిన బ్రహ్మంతో గోపవరానికి చెందిన ఆకుల సత్యనారాయణ వాదించాడు. దీంతో బ్రహ్మం తన పెదనాన్న దాకారపు అర్జునరావును ఇంటికి వెళ్లి నిలదీశాడు. దీంతో ఆకుల సత్యనారాయణతో అర్జునరావు ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో సత్యనారాయణ, తన కుమారుడు, తన అన్న కుమారులతో కలిసి అర్జునరావుపై దాడి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన అర్జునరావు సోమవారం కలుపు మందు తాగటంతో అతడిని అమలాపురం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. అర్జునరావు చికిత్స పొందే క్రమంలో పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం ఆకుల సత్యనారాయణ, అతడి కుమారుడు, అతడి అన్న కుమారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

### ఫార్మసీ ఫస్ట్ ర్యాంకర్‌కు త్వరలో సత్కారం



యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకర్ భాగ్యవతి

**తాళ్లరేవు:** మాస్టర్ ఆఫ్ ఫార్మసీలో యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించిన అంకెం భాగ్యవతిని ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ త్వరలో సత్కరించనుందని కోరింగా ఫార్మసీ కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భాగ్యవతి తమ కళాశాలలో 2020–2022 విద్యా సంవత్సరంలో మాస్టర్ ఆఫ్ ఫార్మసీ పూర్తి చేసి ప్రథమ ర్యాంకు సాధించిందన్నారు. విద్యార్థినిని కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి అభినందించారు.

### మండపేటలో జగనన్నకు చెబుదాం వాయిదా

**అమలాపురం రూరల్:** మండపేట మండలంలో బుధవారం జరగాల్సిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

### పంచాయతీ తీర్మానం

**ఉప్పలగుప్తం:** మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి చింతలచెరువు ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ దృష్టికి గ్రామస్తులు ఒక సమస్యను తీసుకెళ్లారు. చింతలచెరువు ప్రాంతంలో 50 ఏళ్లుగా 190 కుటుంబాల సభ్యులం నివస్తున్నామని, అయితే ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణ రుణాలు, భూపట్టాలు తమకు వర్తించడం లేదని తమ గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన శ్రీకాంత్ మంత్రి విశ్వరూప్‌తో చర్చించి సమస్య పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి బండిదారిని గ్రామ కంఠం భూమిగా మార్చాలని పంచాయతీ తీర్మానం చేయించి తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరికి మంగళవారం అందించారు. నిబంధనల ప్రకారం తరగతి మార్పు నిమిత్తం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు.

## మానసిక ఒత్తిడికి లోను కాకూడదు

- జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా

**ముమ్మిడివరం:** ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడికి లోను కాకుండా శాంతియుత జీవితం గడపాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ మెంటల్ హెల్త్ డే సందర్భంగా మంగళవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మానసిక ఒత్తిడికి లోనైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం లేదా మానసిక వైద్యుని ద్వారా వైద్యం అందించడం మంచిదన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వారికి అవసరమైన ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్వీ ప్రసాదరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.దయానా, డా.అనిల్‌కుమార్, డా.శృతి పాల్గొన్నారు.

## పుదుచ్చేరి మంత్రి చంద్ర ప్రియాంక రాజీనామా



**యానాం:** పుదుచ్చేరి ట్రాన్స్‌పోర్టు అండ్ ఆర్ట్స్, కల్చర్ శాఖా మంత్రి చంద్ర ప్రియాంక మంగళవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి కారైకల్ ప్రాంతంలోని నెడుంగాడు(ఎస్సీ) నియోజకవర్గ శాసనసభ్యురాలుగా గెలిచిన చంద్ర ప్రియాంకను సీఎం రంగసామి తన మంత్రివర్గంలో చేర్చుకున్నారు. ఆమెకు ట్రాన్స్‌పోర్టు శాఖతో ఆదిద్రావిడ సంక్షేమ, హౌసింగ్‌బోర్డు, కార్మిక సంక్షేమం, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖలు సైతం అప్పగించారు. అయితే సీఎం రంగసామి రెండు రోజుల క్రితం రాజ్‌నివాస్‌లో ఎల్జీ తమిళిసై సౌందరరాజన్‌తో సమావేశమయ్యారు. ప్రియాంక గత కొన్ని నెలల నుంచి తన శాఖకు చెందిన ఫైల్స్ చూడటం లేదని, ఆమెను పదవి నుంచి తొలగించాలనే అంశం చర్చించినట్లు తెలుస్తుంది. ఈ విషయం తెలిసిన మంత్రి ప్రియాంక తనను తొలగించే ఇవ్వకూడదనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేశారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడలేకే తన పదవికి రాజీనామా చేస్తున్నానని మంత్రి ప్రియాంక కారైకల్, నెడుంగాడు ప్రజలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**కాట్రేనికోన:** చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మానసిక వైద్యురాలు పసుపులేటి సౌమ్య మాట్లాడుతూ అధ్యాపకులు ఒత్తిడిలేని విద్యా బోధన విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురైనపుడు ఆత్మహత్యలు ఒక్కటే మార్గం కాదని, ఒత్తిడిని అధిగమించి మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రినిపాల్ సీహెచ్ వీఎస్ పరమేశ్వరరావు, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

**మానసిక సమస్యలకు చికిత్స అవసరం**

**యానాం:** మానసిక సమస్యలకు త్వరగా చికిత్స చేయించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆర్.శ్రీరాములు పేర్కొన్నారు. అక్టోబర్ 10 వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేలా అందరూ సానుకూల ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. భౌతిక ఆరోగ్యానికి మానసిక ఆరోగ్యమనేది ప్రేరకంగా పనిచేస్తుందన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ ఫలితాల విడుదల

**యానాం:** ల్యాండ్ అండ్ సర్వే శాఖలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 8న నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ కార్యదర్శి ఎల్.కుమార్ మంగళవారం రాత్రి విడుదల చేశారు. యానాం నుంచి ఎంబీసీ కేటగిరి నుంచి కొప్పనాతి భైరవస్వామి, ఈడబ్ల్యూఎస్ కేటగిరి నుంచి కుంచే ప్రభురాణి, కరెడ్ల అరుణాదేవి, కనకాల సురేష్ ఎంపికయ్యారు. ఈడబ్ల్యూఎస్ వెయిటింగ్ లిస్ట్‌లో తాళ్లూరి వెంకన్న బాబు, పేరాబత్తుల నాగభూషణం ఉన్నారు.

# పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



భట్నవెల్లి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి విశ్వరూప్



కొమరిగిరిపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



గాడిలంకలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు



జి.వేమవరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీడీఓ అనుపమ



పాతయింజరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

**అమలాపురం రూరల్:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం భట్నవిల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి విశ్వరూప్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో స్టాళ్లను నిశితంగా పరిశీలించి వైద్య సేవలు గురించి ఆరా తీశారు. ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు కలిసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రిఫరల్ వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, సర్పంచ్ తిరికోటి సూజాత, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, కార్యదర్శులు రెడ్డి శిరీష, కట్టా సత్తిబాబు, ఎంపీటీసీ తొత్తరమూడి మరయమ్మ తదితరులు పాల్గొన్నారు.

**అల్లవరం:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. నోడల్ అధికారి, తహసీల్దార్ సాంబశివప్రసాద్ ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ సంపూర్ణ వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మంగళవారం జి.వేమవరం–2లో జరిగిన సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇప్పటివరకూ మండలంలోని 8 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 3 వేలకు మందికి వైద్యసేవలు అందించామన్నారు. శిబిరంలో రోగులకు మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, దెయ్యాల సత్తిబాబు, మట్టా లింగమూర్తి, నీలపాల శ్రీను, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, బొడ్డు కుమార్, కాలా చిన్న తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం:** జగనన్న సురక్షతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు అన్నారు. మండలంలోని గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. శిబిరంలో 430 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఈఓపీఆర్‌డీ సీహెచ్‌ఎల్ కల్యాణి, సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు, చింతా నాగమునీంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు గిరిగి వీర దుర్గాకుమారి తదితరులు పాల్గొన్నారు.

**ఐ.పోలవరం:** ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. మంగళవారం పాతయింజరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారిద్దరూ సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. శిబిరంలో 425 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో , ఎంపీడీఓ డి.రాంబాబు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వైద్యురాలు కె.ఇందిరాశ్రీ, కొండేపూడి కృపావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం:** మండలంలోని కూనవరంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ పరిశీలించారు. శిబిరంలో వైద్యులు 407 మంది రోగలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఊటాల రామాంజనేయులు, ఆకుల చిన్ని, కాట్రు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.